

రైల్వే మంత్రి దృష్టికి రైళ్ల హాల్టింగ్స్ సమస్య

రాజంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, నందలూరు తదితర రైల్వే స్టేషన్లలో రైళ్ల హాల్టింగ్స్ విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసు కెళ్లినట్లు ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ॥ (సా॥)	సహర్ గురు॥ (ఉ॥)
రాయచోటి	6.30	4.59
రాజంపేట	6.28	5.07
పీలేరు	6.30	4.57
మదనపల్లె	6.32	5.00

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 122 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	680	680
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 96.840 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: అన్నమయ్య జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర ప్రవేశానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి మే 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ముగిసిన నామినేషన్ల పర్వం



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కృష్ణకుమార్ ప్యానల్

రాజంపేట: రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం నామినేషన్ల పర్వం ముగిసింది. బుధవారం నామినేషన్ల స్క్రూటినీ కార్యక్రమం నిర్వహించనున్నారు. సీఈవో సురేష్‌కుమార్ నేతృత్వంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. కాగా రెండవ రోజు కృష్ణకుమార్ తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. హనుమంతనాయుడు, కృష్ణకుమార్ ప్యానల్‌ల మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది.

29న రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికలు

రాయచోటి అర్బన్: ఏపీ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఈ నెల 29న రాయచోటి బార్ అసోసియేషన్‌కు సాధారణ ఎన్నికలు జరిగేలా రాయచోటి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించినట్లు అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరెడ్డి, కార్యదర్శి పి.రెడ్డెయ్య తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సీనియర్ న్యాయవాది రాజకుమార్‌రాజు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఇలియాస్ బాషాను ఎగ్జిక్యూటివ్ కమిటీ నియమించిందన్నారు. ఈ నెల 20, 21, 22 తేదీలలో నామినేషన్లు దాఖలు చేయవచ్చునని పేర్కొన్నారు. 24న నామినేషన్ల పరిశీలన, 25న ఉపసంహరణకు సమయం ఉంటుందన్నారు. 29న పోలింగ్, అదే రోజు సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మేరకు ఎన్నికల అధికారి రాజకుమార్‌రాజు నోటిఫికేషన్ విడుదల చేశారు.

మెరుగైన పరిహారం ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

గాలివీడు: భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మండల పరిధి తూముకుంట గ్రామ పంచాయతీలోని దిగువ మూలపల్లిలో సీపీఎం మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో దాదాపు 60 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరికి 40 ఏళ్ల నుంచి సాగులో ఉన్న భూమిని సోలార్ ప్రాజెక్టు పేరుతో తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధపడిందని తెలిపారు. అయితే వీరికి 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించిన తర్వాతే భూములు తీసుకోవాలని పేర్కొన్నారు. భూమికి భూమి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఇంటికి ఒక ఉద్యోగం, పునరావాసం తదితరాలు ప్రభుత్వాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వేయర్ సస్పెన్షన్

బి.కొత్తకోట: పీటీఎం మండలం టీ.సదుం సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేంద్రను సస్పెన్షన్ చేస్తూ జిల్లా సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీలో జరిగిన భూముల వ్యవహారంపై తహసీల్దార్ అజారుద్దీన్, సర్వే డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ పంపిన నివేదికల ఆధారంగా ఈ చర్య తీసుకున్నారు. గుమ్మసముద్రం పంచాయతీలో జరిగిన భూముల రీసర్వేలో రాజేంద్ర పని చేశారు. గండువారిపల్లె గ్రామానికి చెందిన భూముల విషయంలో అన్ని సర్వే నంబర్లు జాయింటు భాగాలు, విస్తీర్ణంలో తేడాలు వేయడం, ప్రభుత్వ భూమిని తల్లిపేరుతో ఆన్‌లైన్ చేయించుకోవడంపై గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గండువారిపల్లె సచివాలయంలో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై విచారణ చేసిన అధికారులు వేర్వేరుగా నివేదికలను పంపగా చర్యలు తీసుకున్నారు. దీనిపై మంగళవారం తహసీల్దార్ అజారుద్దీన్ మాట్లాడుతూ రాజేంద్రను సస్పెన్షన్ చేయడంతోపాటు ఆరోపణలపై సమగ్ర విచారణకు సర్వే డెప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను అధికారులు నియమించారని చెప్పారు.



సచివాలయాలకు కోత.. ప్రజలకు వెత

వైఎస్సార్‌సీపీ పాలన ముద్ర.. రాష్ట్రంపై చిరకాలం ఉండరాదని కూటమి కక్ష కట్టింది. ఇందుకోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అయిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోంది. వీటి ద్వారా జనానికి అందించే సేవల్లో కోత విధించింది. తాజాగా రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తోంది. పర్యవసానంగా ప్రజలు మళ్లీ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల ముంగిటకే సేవలు
- జిల్లాలో 502 సచివాలయాల ఏర్పాటు
- కొత్తగా రెండింటిని కలిపి ఒక క్లస్టర్‌గా మ్యాపింగ్
- సాంకేతిక సిబ్బంది కుదింపు
- 1,757 మందిని తొలగించే అవకాశం
- ఇప్పటికే 372 సేవల తొలగింపు



పెద్దతిప్పసముద్రం గ్రామ సచివాలయం

బి.కొత్తకోట: మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపన దిశగా గత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థపై.. కూటమి ప్రభుత్వం కక్ష కడుతోంది. ప్రజలకు మంచి చేయాలన్న సమున్నత ఆశయంతో అమలు చేసిన సచివాలయ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసేలా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిపై ఆదేశాలు ఇవ్వడంతో క్షేత్రస్థాయిలో కార్యాచరణ మొదలైంది. ఫలితంగా ప్రజల ముంగిటకు పాలనను తీసుకొచ్చి.. వందల సంఖ్యలో ప్రభుత్వ సేవలు అందించిన సచివాలయాలను నిర్వీర్యం చేసే ప్రయత్నంగా కనిపిస్తోంది. వలంటీర్ల వ్యవస్థను అటకెక్కించిన ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ సర్కారు ప్రజల కోసం తీసుకొచ్చిన కార్యక్రమాలను ఒక్కొక్కటిగా దూరం చేసే ప్రక్రియకు శ్రీకారం చుడుతోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

జిల్లాలో ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఉండేలా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మారుమూల ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలు, 30 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 502 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో ప్రజలకు కలిగిన ప్రయోజనం అంతా ఇంతా కాదు. ప్రతి పనికి మండల కేంద్రానికి రావాల్సిన అవసరం తప్పింది. ఎక్కడికక్కడ సేవలు పొందే పరిస్థితి వచ్చింది. దీనివల్ల ప్రజలకు ప్రయాణ భారం, సమయం వృథా తప్పింది. అందులోనూ మండల కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్తే అధికారులు అందుబాటులో లేకుంటే మళ్లీ వెళ్లాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దూరం చేసింది.

కొత్తగా క్లస్టర్లు

జిల్లా సచివాలయ వ్యవస్థను క్లస్టర్లుగా మార్చేందుకు చర్యలను అధికారులు చేపట్టారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా చేస్తున్నారు. వీటికి మ్యాపింగ్ కూడా చేస్తున్నారు. అంటే 502 సచివాలయాలను 251 క్లస్టర్లుగా మార్చుతారు. ప్రస్తుతం ఒక్కో సచివాలయంలో సాంకేతిక విభాగానికి చెందిన ఉద్యోగులు గ్రామ రెవెన్యూ అధికారి, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయ (అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్), పశు సంవర్ధక (వెటర్నరీ, ఫిషరీష్), ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగులు ఏడుగురు, సాధారణ పరిపాలనకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి–గ్రేడ్ 1–5, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, గ్రామ మహిళ పోలీసు ఉద్యోగులు ఐదుగురు ఉంటారు. ఒక్కో సచివాలయానికి మొత్తం 11 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

సగానికి తగ్గించే యత్నం



ప్రజలు లేక వెలవెలబోతున్న నందిరెడ్డిగారిపల్లి సచివాలయం

రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా చేస్తున్న ప్రభుత్వం సాంకేతిక విభాగం కింద పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్యను సగానికి తగ్గించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఒక క్లస్టర్ పరిధిలో రెండు సచివాలయాలు ఉంటే.. అందులో రెండు సచివాలయాల్లో పని చేస్తున్న సాధారణ పరిపాలన ఉద్యోగులు ఐదుగురు యథావిధిగా ఉంటారు. అయితే సాంకేతిక విభాగానికి చెందిన ఏడుగురు ఉద్యోగులు మాత్రమే విధుల్లో ఉండే అవకాశం ఉంటుంది. రెండు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఒక సచివాలయ ఉద్యోగులను తగ్గించి రెండు సచివాలయ బాధ్యతలను ఒక ఉద్యోగికి అప్పగించేలా ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీంతో ఒక సచివాలయానికి చెందిన ఏడుగురు ఉద్యోగులను బాధ్యతల నుంచి తప్పించినట్లవుతుంది. తద్వారా సచివాలయ వ్యవస్థకు జిల్లాలో 1,757 మంది ఉద్యోగులను దూరం చేసే అవకాశం ఉంది. ఈ ప్రభావం ప్రజలకు అందించే క్షేత్రస్థాయి సేవలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.



అరకొర సేవలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవల్లో తీవ్రంగా కోతలు వేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 545 సేవలను ప్రజలు పొందడం జరిగేది. ప్రస్తుతం 173 సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 372 ప్రభుత్వ సేవలు ప్రజలకు అందడం లేదు. దీనికోసం ప్రజలు మీసేవ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పుడు అందిస్తున్న 173 సేవల్లో అత్యధికంగా మీసేవల్లో అందిస్తున్న సేవలు ఉన్నాయి. 545 సేవల్లో ఒకటి నుంచి 127 దాక ఉన్న సేవలు మాత్రమే మీసేవల్లో లేవు. మిగిలిన వన్నీ మీసేవల్లో అందుబాటులోకి తెచ్చారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆధార్ సంబంధిత సేవలను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనితో సచివాలయాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు.

సచివాలయాల సంఖ్య

30 మండలాల్లో:	414
మున్సిపాలిటీలు	
మదనపల్లె:	44
రాయచోటి:	25
రాజంపేట:	13
బి.కొత్తకోట:	5

545 సేవల్లో మిగిలింది ఇవే...

ఎక్సైజ్ అండ్ రెవెన్యూ: 34	మైన్స్: 1
పౌరసఫరాలు: 2	విపత్తు, అగ్నిమాపక: 3
ఆరోగ్య, కుటుంబ సంక్షేమం: 3	రవాణా: 5
జీఎస్‌డబ్ల్యూఎస్: 4	ఎపీపీఎస్‌ఎస్: 2
మానవ వనరులు: 1	చెల్లింపుల సేవలు: 3
పీఆర్ అండ్ మున్సిపల్: 1 (ఇందులో 25 అంశాలు)	మీసేవల్లో ఉండేవి: 87
సదరం: 1	మిగిలిన సేవలన్నీ బంద్ అయ్యాయి

బరితెగించిన టీడీపీ మూకలు

- వృద్ధ వికలాంగుడిపై దాడి
- అతని జీవనాధారం చిల్లర బంకు ధ్వంసం
- వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులు అంగడి దగ్గర కూర్చుంటున్నారని కక్ష
- బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు

రామాపురం: వైఎస్సార్‌సీపీ వర్గీయులను చిల్లర కొట్టు దగ్గర కూర్చోబెట్టుకోవడమే.. వికలత్వం కలిగిన వృద్ధుడు దేరంగుల వెంకటరమణ (74) చేసిన తప్పు. పర్యవసానంగా స్థానికంగా ఉన్న టీడీపీ రౌడీ మూకలు.. చిల్లర బంకే జీవనాధారంగా, నడవలేని స్థితిలో జీవనం సాగిస్తున్న అతనిపై కక్ష కట్టారు. ఎన్నికల తర్వాత ఒకటి కాదు, రెండు కాదు, మూడు పర్యాయాలు.. ఆ బంకుపైకి దాడికి తెగబడినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి కొంత మంది టీడీపీ రౌడీ మూకలు.. అతనితోపాటు బంకుపై దాడి చేశారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సురకవాండ్లపల్లిలో 74 ఏళ్ల వృద్ధుడు దేరంగుల వెంకటరమణ వేరే జీవనాధారం లేక.. చిల్లర కొట్టు దుకాణాన్ని ఏర్పాటు చేసుకొని స్వయం శక్తితో జీవనం సాగిస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో.. గ్రామంలోనీ వైఎస్సార్‌సీపీకి చెందిన కొంత మంది వర్గీయులను బంకు దగ్గర కూర్చోబెట్టుకోవడం అతను చేసిన పాపంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. స్థానికంగా ఉన్న అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు అతనిపై కక్ష కట్టారు. 40 ఏళ్లుగా వున్న బంకును తొలగించాలని ఆరు నెలల నుంచి వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో అతను ఇటీవల జాయింట్ కలెక్టర్‌ను ఆశ్రయించడంతో తహసీల్దార్ ద్వారా విచారణ చేసి.. న్యాయం చేశారని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సోమవారం అర్ధరాత్రి ఆటోలలో వచ్చి తమపై దాడి చేసి బంకు పేకిలించే ప్రయత్నం చేశారని, బంకులోని సామగ్రిని బయటపడేసి, అరుగు బండలను ధ్వంసం చేశారని ఎస్పీకి అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని ప్రజా సంఘాలతో కలిసి వృద్ధుడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.



వెంకటరమణ

వేగంగా భూముల రీ సర్వే

కలెక్టరు శ్రీధర్ ఛామకూరి



వాల్మీకిపురం మండలం బూడిదవేడులో రీ సర్వే మ్యాపును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు శ్రీధర్ ఛామకూరి


కలికిరి(వాల్మీకిపురం): భూముల రీ సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టరు శ్రీధర్ ఛామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వాల్మీకిపురం మండల పరిధిలోని బూడిదవేడు గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. జనవరి 20 నుంచి గ్రామంలో రీ సర్వే ప్రక్రియ ప్రారంభించామని, ఇప్పటి వరకు వెయ్యి ఎకరాలకు పైగా పూర్తి చేసినట్లు తహసీల్దారు పామిలేటి కలెక్టరుకు వివరించారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పట్టా భూములు తదితరాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యం సాధించాలి

గుర్రంకొండ: అధికారులు, సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రగతి సాధించాలని కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఏ గ్రామంలో సర్వే చేస్తున్నారు, ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయి, అందులో డ్రైల్యాండ్, వెట్‌ల్యాండ్ ఎంత మేరకు విస్తీర్ణంలో ఉన్నాయో ఆరా తీశారు. సదరు గ్రామంలో రీసర్వే ఎప్పుడు చేపట్టారు, ఎన్ని టీములు సర్వే చేస్తున్నాయి, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో పూర్తి చేశారు, ఇంకా ఎంత మేరకు పెండింగ్‌లో ఉంది అనే వివరాలను తహసీల్దార్, మండల సర్వేయర్‌ను అడిగి తెలుసుకొన్నారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో రీసర్వే ప్రక్రియ జరుగుతోందని, గ్రామాన్ని 11 బ్లాకులుగా విభజించి 3356 ఎకరాలు సర్వే చేస్తున్నామని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇసుకాసురులు

- నదుల్లో యంత్రాలు పెట్టి తోడేస్తున్న అక్రమార్కులు
- చెయ్యేరు, బాహుదాతోపాటు పలు చెరువుల్లోనూ తవ్వకాలు
- ట్రాక్టర్లను పట్టుకుంటున్నా ఆగని అక్రమ రవాణా
- సరిహద్దులు దాటుతున్నా.. పనిచేయని నిఘా



చెయ్యేరు నదిలో సాగుతున్న ఇసుక తవ్వకాలు

సాక్షి రాయచోటి: కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ ఇసుక తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతాన్ని అనువుగా చేసుకుని ఇసుకను తరలిస్తున్నారు. యథేచ్ఛగా తరలుతున్నా ఇదేమని అడిగే అధికారులు లేకపోగా.. ఇది అక్రమమని చెప్పే ప్రజాప్రతినిధులు కూడా ముఖం చాటేస్తుండటంతో సరిహద్దులు దాటుతోంది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తవ్వకాలు జరుగుతున్నా అధికారులు నోరు ఎత్తడం లేదు. నదిలో తవ్వకాలకు అధికారులు ఇచ్చిన ప్రాంతం ఒక చోటైతే, ఇసుకాసురులు ఇంకా లోపలికి వెళ్లి తీస్తున్నా పట్టించుకునే వారు లేరు. జిల్లాలో ఇసుక రీచ్‌లు 6–8 వరకు ఉండగా, అధికార పార్టీ నాయకులకు కనక వర్షం కురుస్తోందని చెప్పవచ్చు. ప్రత్యేకంగా నదుల్లోనే రోడ్లు వేసుకుని మరీ తరలిస్తున్నారు. ప్రధానంగా అక్రమ వ్యవహారాలను నిరోధించాల్సిన పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ తదితర శాఖల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం ఆందోళన కలిగించే పరిణామం.

చెయ్యేరు, బాహుదా నదుల్లో..

అన్నమయ్య జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్దవటం మండలంలోని చెయ్యేరు నుంచి ఇసుకను ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా ఆయా గ్రామాల పరిధిలోని గ్రామస్తుల కంట పడకుండా కనురెప్పపాటున తరలిస్తున్నారు. అలాగే పీలేరు నియోజకవర్గం కలికిరి సమీపంలోని బాహుదా నదిలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. రామసముద్రం మండలంలోని పలు చెరువుల నుంచి తోడి కర్ణాటకకు రాత్రికి రాత్రే సరిహద్దులు దాటిస్తున్నారు. దర్జిపల్లె, జంగాలపల్లె సరిహద్దు ప్రాంతాల్లో ఏకంగా పొక్లెయిన్లతోనే ట్రాక్టర్లకు పోసి తీసుకెళ్తున్నారు. రీచ్ ముసుగులో అధికారం ఉండగా ఎవరూ అడ్డుకోలేరన్న ధీమాతో తరలించేస్తున్నారు.

ఆగని అక్రమ రవాణా

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు అడపాదడపా దాడులు చేసి పట్టుకుంటున్నా.. రాత్రి పొద్దుపోయాక, తెల్లవారుజాము సమయంలో పోలీసుల కళ్లుగప్పి అక్రమ రవాణా సాగుతోంది. ఫిబ్రవరిలో సిద్దవటం పోలీసులు పలు ట్రాక్టర్లను కూడా పట్టుకుని జరిమానా విధించారు. అంతకు మునుపు నందలూరు, పెనగలూరులో కూడా భారీగా పట్టుబడ్డాయి. అయితే ఎంత చిక్కుతున్నా.. మళ్లీ ఇసుక రవాణా మాత్రం యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఎప్పుడు చూసినా నిరంతరాయంగా సాగుతోంది. ఏదిఏమైనా తమను అడ్డుకోలేరన్న ధైర్యమో, లేక పట్టుకున్నా అధికారం ఉండగా ఏమి కాదులే అన్న భరోసానో తెలియదు గానీ.. విచ్చలవిడిగా తరలిస్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా.. అధికార పార్టీ నేతలు దోచేస్తున్నారు.

మీకు జయచంద్రారెడ్డి చెప్తారు

- పోలీసులతో పేర్కొన్న కాంగ్రెస్ నేత
- సంబంధిత ఫోన్‌కాల్ వైరల్

సాక్షి, కడప: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుకను తరలించుకునేలా టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి మీకు చెప్తారంటూ కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడిన ఫోన్‌కాల్ వైరల్ అయ్యింది. నియోజకవర్గానికి చెందిన మల్లెల గ్రామంలో ఇసుకను హంద్రీనీవా పనులకు తరలిస్తామని, ఎందుకు అడ్డుకుంటారని కాంగ్రెస్ నాయకుడు అధికారులపై ఫోన్‌లోనే ఒత్తిడి చేస్తుండగా.. రెవెన్యూ అధికారులు నిబంధనల గురించి చెబుతున్నా వినకుండా.. టీడీపీ నేత జయచంద్రారెడ్డి బెంగళూరులో ఉన్నాడు, మీకు ఫోన్ చేసి చెబుతాడని కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. ఈ కాల్ ఆడియోపై ఆ ఇద్దరి ఫొటోలు పెట్టి కొందరు వైరల్ చేశారు.

జెడ్పీ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ



కడపలోని జెడ్పీ మీటింగ్ హాల్

కడప సెవెన్‌రోడ్స్: కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 23న జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ జెడ్పీ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఉద్దేశించిన ప్రత్యేక సమావేశం ఏర్పాటు కోసం నోటీసు జారీ చేస్తారు. ఈ నోటీసు జెడ్పీ సభ్యులందరికీ అధికారులు అందజేయాల్సి ఉంటుంది. ఈనెల 27వ తేది ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి జెడ్పీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఆరోజు ఉదయం 10 గంటల ముందు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 12.00 గంటల్లోపు స్క్రూటినీ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అర్హతగల నామినేషన్ల జాబితా విడుదల చేస్తారు. 1 గంటవరకు నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ఉంటుంది. ఆపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. సమావేశం ముగిసిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. ఏదైనా కారణాల వల్ల ఆరోజు ఎన్నిక జరగకపోతే మరుసటిరోజు ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే ఉమ్మడి కడపజిల్లాలోని ఖాజీపేట, ఒంటిమిట్ట, రాయచోటి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నికలను కూడా నిర్వహిస్తారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డి రాజంపేట అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరపున గెలుపొందడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం ఇన్‌చార్జి చైర్ పర్సన్‌గా జేష్టాది శారద వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో జిల్లా పరిషత్‌కు కొత్త అధ్యక్షుడు ఎన్నిక కానుంది.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనంపై కేసు

బి.కొత్తకోట : మండలంలోని గట్టులో రోడ్డుపక్కన నిలబడి ఉన్న విద్యార్థిని ఢీకొని ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనంపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. ఆకులవారిపల్లెకు చెందిన పదవ తరగతి విద్యార్థి లహిత్‌కుమార్ రెడ్డి గట్టు హైస్కూల్లో వీడ్కోలు సమావేశం అయ్యాక గట్టుకు వచ్చాడు. ఈ సమయంలో వాహనం ఢీకొనడంతో కుడికాలుకు తీవ్ర గాయమైంది. వాహనం ఆగకుండా వెళ్లిపోవడంతో గుర్తు తెలియని వాహనంపై కేసు నమోదు చేశామని తెలిపారు.

35 గ్రాముల బంగారు గొలుసు చోరీ

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛాలో అమ్మణ్ణెమ్మ తన మనవడిని చూసేందుకు ఈ నెల 8వ తేదీన బెంగళూరుకు వెళ్లింది. సోమవారం తిరిగి తన స్వగ్రామానికి చేరుకుంది. ఇంటిలోకి వెళ్లగా ఇంటికి ఉన్న కిటికీ తొలగించి ఉంది. బీరువా తాళాలు పగలగొట్టి 35 గ్రాముల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితురాలు గుర్తించింది. ఈమేరకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సుండుపల్లె ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

ప్రమాదంపై కేసు నమోదు

బి.కొత్తకోట : మండలంలోని రామాపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానిక జయశ్రీకాలనీకి చెందిన చిత్తూరు ఆర్టీసీ డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జయచంద్ర, అతని భార్య సువర్ణలు బైక్‌పై వస్తుండగా ఐషర్ వాహనం ఢీకొంది. ఘటన తర్వాత డ్రైవర్ పరారు కావడంతో ప్రమాదానికి కారణమైన ఐషర్‌ను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టిన రోజే.. ఆఖరి రోజు!

- ఇద్దరు యువకులను బలిగొన్న రోడ్డు ప్రమాదం
- పీటీఎం అంబేడ్కర్ కాలనీలో విషాద ఛాయలు




సాదిలి చందూ కుమార్ (ఫైల్) దండు శీనూ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : పుట్టిన రోజే ఆ యువకుడికి ఆఖరి రోజు అవుతుందని కలలో కూడా ఊహించి ఉండడు. యువకుడితో పాటు అతని స్నేహితుడు సైతం రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ దుర్ఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా సినిమాకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరిన ఇద్దరు యువకులను మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఓ యువకుడు చనిపోగా ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో మరో యువకుడు మృత్యువాత పడ్డాడు. దీంతో స్థానిక అంబేడ్కర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. కాలనీకి చెందిన సాదిలి చందూకుమార్ (20) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇదే కాలనీకి చెందిన దండు శీనూ (21) ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం దండు శీనూ జన్మదినం కావడంతో వీరిద్దరూ పుట్టిన రోజు వేడుక సందర్భంగా బి.కొత్తకోటలో సెకండ్ షో సినిమా చూసేందుకు సోమవారం రాత్రి పీటీఎం నుంచి ద్విచక్ర వాహనంలో బయలు దేరారు. సినిమా చూసిన అనంతరం 12 గంటల తరువాత ద్విచక్ర వాహనంలో పీటీఎంకు వస్తున్నారు. ఈ క్రమంలో బి.కొత్తకోట రోడ్డులోని ఓ కోళ్ల ఫారం సమీపంలో గుర్తు తెలియని వాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో దండు శీనూ అక్కడికక్కడే మృతి చెందాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న మరో యువకుడు సాదిలి చందూను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలిస్తుండగా పీలేరు సమీపంలో మృతి చెందాడు. అయితే ఘటన స్థలం వద్ద ఓ అడవి పిల్లి మృతి చెంది ఉండటాన్ని బట్టి చూస్తే పిల్లిని తప్పించి వాహనాన్ని పక్కకు తిప్పి వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనం యువకులను ఢీకొందా.. వెనుక నుంచి వాహనం ఢీకొని ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ హరిహర ప్రసాద్ మంగళవారం మృతదేహాలకు పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకువి.. కాటికి కాళ్లు చాపే వయసులో మమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంటావనుకుంటే ఇలా అర్ధంతరంగా వెళ్లిపోయావా నాయనా.. అంటూ సాదిలి చందూ తల్లిదండ్రులు విలపిస్తుంటే చూపరులు సైతం కంట తడి పెట్టారు. కాలనీలో ఇద్దరు యువకుల అకాల మరణంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో దుస్తుల వ్యాపారి దుర్మరణం

- మృతుడి స్వస్థలం కడప
- బెంగళూరుకు వెళుతుండగా దుర్ఘటన




జహీర్ (ఫైల్) విలపిస్తున్న షమీర్



మృతి చెందిన జహీర్



కురబలకోట మండలంలో సంఘటన స్థలం

కురబలకోట ; కడప నగరంలోని జెడ్ఆర్ ఫ్యాషన్ వరల్డ్ నిర్వాహకుడు షేక్ జహీర్ (28) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో జరిగిన ఈ విషాదకర సంఘటనకు సంబంధించి ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. కడప నగరానికి చెందిన జహీర్ రెండేళ్లుగా కడపలో జెడ్ఆర్ ఫ్యాషన్ వరల్డ్ పేరిట రెడీమేడ్ దుస్తుల షాపు నిర్వహిస్తున్నాడు. గతంలో ట్రావెల్స్‌లో పని చేసేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు సంతానం. భార్య ప్రస్తుతం గర్భిణి. రంజాన్ సందర్భంగా విక్రయానికి అవసరమైన దుస్తులు కొనుగోలు చేసేందుకు తమ్ముడు షమీర్ (26)తో కలిసి షేక్ జహీర్ కారులో బెంగళూరు బయలుదేరాడు. తనే కారు నడుపుకుంటూ వస్తుండగా కురబలకోట మండలంలోని మధ్యాహ్నంవారిపల్లె–రామిగానిపల్లె మధ్యలో మదనపల్లె–2 డిపోకు చెందిన గాలివీడు ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చింది. ప్రమాదవశాత్తు బస్సును కారు ఢీకొంది. ఈ సంఘటనలో జహీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తమ్ముడు షమీర్ కారులో వెనుక సీట్లో ఉండడంతో గాయాలతో బయటపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం జహీర్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

మృతుడిపైనే కేసు.!

ఇదిలా ఉండగా ప్రమాదానికి మృతుడు జహీర్ కారణమని కేసు నమోదు చేయాల్సి వచ్చిందని ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. డ్రైవింగ్ చేస్తున్న జహీర్ కారును నిద్రమత్తులో అదుపు చేయలేక వేగంగా బస్సును ఢీ కొట్టడం వల్లే ఈ సంఘటన జరిగినట్లు అటు విచారణలోను ఇటు సంఘటన స్థల పరిశీలనలోను వెల్లడైందన్నారు. చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేయడం ఇదేమి.. విచిత్రం స్వామీ అంటూ పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఎల్లకూరి చంద్రశేఖర్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని తురకపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న ఎల్లకూరి చంద్రశేఖర్‌రెడ్డి (36) అనే వ్యక్తి అప్పుల బాధతో మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం చాముండేశ్వరిపేట గ్రామానికి చెందిన ఎల్లకూరి చంద్రశేఖర్‌రెడ్డి ఆరేళ్ల నుంచి కడపకు చెందిన తోట నాగార్జున తురకపల్లెలో నిర్మించిన వెంగమాంబ సిమెంటు ఇటుకల తయారీ కేంద్రంలో వాచ్‌మెన్, డ్రైవర్‌గా పనిచేసేవాడు. కడపకు చెందిన షేక్ షబానాను భర్త వదిలేయడంతో చంద్రశేఖర్‌రెడ్డి ఆమెను వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఇతను భార్య షేక్ షబానా, ఆమె మొదటి భర్త కుమారుడు మస్తాన్‌వలీతో కలిసి తురకపల్లిలో నివాసం ఉంటున్నాడు. మృతుడి యజమాని వద్ద రూ.2లక్షలు అప్పు తీసుకున్నాడు. మంగళవారం ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఎంతసేపటికి రాక పోవడంతో భార్య షబానా అక్కడికి వెళ్లి చూసింది. అయితే అప్పటికే చీరతో ఉరివేసుకుని ఉన్నాడు. వెంటనే ఆమె చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చి ఆమె కుమారుడి సాయంతో మృతదేహాన్ని కిందకు దింపారు. మృతుడి తల్లి మల్లేశ్వరమ్మ కుమారుడి మృతదేహాన్ని చూసి తన కుమారుడికి మద్యం తాగే అలవాటు ఉందని, భార్యతో గొడవ పడేవాడని తెలిపింది. ఈ సంఘటనపై విచారించి న్యాయం చేయాలని సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఉప రాష్ట్రపతిని కలిసిన రాజ్యసభ సభ్యుడు మేడా



రాజంపేట : ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్కర్‌ను రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం ఆయన చాంబరులో కలిశారు. తనను ఎథిక్స్‌కమిటీ సభ్యునిగా నామినేట్ చేసిన సందర్భంగా ఉప రాష్ట్రపతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అక్కడ అదృశ్యం.. ఇక్కడ ప్రత్యక్షం



చోరీకి గురైన ద్విచక్రవాహనం

కలకడ : కదిరాయచెర్వులో అదృశ్యమైన ద్విచక్రవాహనం పీలేరులో ప్రత్యక్షమైనట్లు వీఆర్ఓ పుల్లయ్య తెలిపారు. కలకడ మండలం కె.బాటవారిపల్లె సచివాలయంలో వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న గుర్రంకొండ మండలం సరిమడుగుకు చెందిన పుల్లయ్య సోమవారం తన ద్విచక్రవాహనం హోండా ఆక్టివాను కదిరాయచెర్వు గ్రామంలో నిలిపి బస్సులో కలకడకు చేరుకున్నారు. సాయంత్రం విధులు ముగించుకుని తిరిగి కదిరాయచెర్వుకు చేరుకుని పరిశీలించగా తన ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగళవారం పీలేరులోని సంత ప్రదేశంలో ద్విచక్రవాహనాన్ని గుర్తించి బాధితుడికి అందజేశారు.

కమనీయం...లక్ష్మీనరసింహుని కల్యాణం



లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : తరిగొండ గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వాతి నక్షత్రంతో పాటు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కనుల పండువగా జరిపారు. ఆలయంలో చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లి వేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం చేశారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందరిని ఆకట్టుకుంది. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక వైభవంగా నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, సిబ్బంది నాగరాజ, ఆలయ అర్చకులు కృష్ణరాజ బట్టార్, అనిల్ స్వామి, గోకుల్ స్వామి పాల్గొన్నారు.

భార్య గర్భిణి.. మరో యువతితో భర్త పరారీ

బి.కొత్తకోట : బి.కొత్తకోట పట్టణానికి చెందిన ఓ యువకుడు కట్టుకున్న భార్యను వదిలి మరో యువతితో వెళ్లిపోయిన ఉదంతంపై బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. భర్తపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. పట్టణానికి చెందిన డ్రైవర్ అనిల్‌కు ములకలచెరువు మండలానికి చెందిన 21 ఏళ్ల యువతితో గతేడాది ఆగస్టులో వివాహమైంది. పెద్దలు కుదిర్చిన ఈ వివాహం అనిల్ ఇంటివద్దే జరిగింది. రెండు నెలలపాటు వీరి సంసారం సజావుగా సాగింది. తర్వాత స్థానికురాలైన ఓ యువతితో అనిల్ సన్నిహితంగా ఉంటున్న విషయం గమనించి భార్య ప్రశ్నించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెళ్లిపో అంటూ తిట్టేవాడు. సర్దుకుపోతున్న భార్య గర్భం దాల్చగా ఇప్పుడు ఆరో నెల. ఈ పరిస్థితుల్లో భర్త అనిల్ ఈనెల 4న ఇంటినుంచి బయటకు వెళ్లగా పనికి వెళ్తున్నాడని అనుకున్నారు. అప్పటినుంచి ఇంటికి రాకపోవడంతో భార్య ఆందోళనకు గురైంది. అయితే భర్తతో సన్నిహితంగా ఉంటున్న యువతి ఇన్‌స్టాలో పెడుతున్న ఫొటోలు చూసి అసలు విషయం గుర్తించింది. దీనితో తన భర్త మరో యువతితో వెళ్లాడని, చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాయచోటి కేసులో 12 మందికి బెయిల్

కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంపై మార్చి 9వ తేదీ పోలీసులు కొంతమందిని అరెస్టు చేశారు. కడప సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న 12 మంది మంగళవారం బెయిలుపై విడుదలయ్యారు.

9 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మదనపల్లె : కులం పేరుతో దూషించి, దౌర్జన్యం చేసి దాడికి పాల్పడిన ఘటనలో తొమ్మిది మంది నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని మాలేపాడు పంచాయతీ నల్లరాజుగానిపల్లెకు చెందిన బి.మునివెంకటరమణ, (69) కు సంబంధించిన పొలాన్ని స్థానికులైన కొందరు ఆక్రమించుకున్నారు. ఈ విషయమై గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సోమవారం మునివెంకటరమణ పొలం వద్ద ఇల్లు నిర్మించుకునే ప్రయత్నం చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన భూ ఆక్రమణకు పాల్పడిన మరో వర్గంలోని వ్యక్తులు ఆర్.బాలకృష్ణమనాయుడు, కాంతమ్మ, రవికాంత్‌నాయుడు, ఆదెమ్మ, శ్రీనివాసులునాయుడు, సోమశేఖర నాయుడు, సంజు, కృష్ణమూర్తిలు దౌర్జన్యం చేసి కులం పేరుతో దాడికి పాల్పడ్డారు. దాడి ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అపశ్రుతి



కిందపడిన నరసింహ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమల–తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ ఏర్పాట్లలో రామాలయం వెనుకవైపు ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద 30 అడుగుల భారీ కటౌట్ ఏర్పాట్లలో భాగంగా పనిచేస్తున్న తిరుపతి టౌన్‌కు చెందిన ఎం.నరసింహ (50) అనే వ్యక్తికి మూర్ఛ రావడంతో 25 అడుగులపై నుంచి కిందపడ్డాడు. అదృష్టవశాత్తు పడినచోట ఎలాంటి రాళ్లు, గట్టినేల లేకపోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తోటి కూలీలు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం తిరుపతికి తీసుకెళ్లారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు చార్విక్‌రెడ్డి

మదనపల్లె : ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. చంద్రాకాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి, గీత దంపతులకు సాత్విక్‌రెడ్డి, చార్విక్‌రెడ్డి(5) ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం సాయంత్రం కాలనీలో నీటిసరఫరా జరుగుతున్న సమయంలో నీళ్లను పట్టుకునేందుకు తల్లి, నానమ్మ హడావిడిలో ఉండగా, ఇంటి ముందు ఆడుకుంటున్న చార్విక్‌రెడ్డి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని బయటకు తీసి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

కారు బోల్తా

– ముగ్గురికి గాయాలు



సూరప్పగారిపల్లె వద్ద బోల్తాపడిన కారు

గుర్రంకొండ : కారు బోల్తా పడి ముగ్గురు గాయపడిన సంఘటన మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె వద్ద జరిగింది. మంగళవారం బెంగళూరుకు చెందిన నంజుండప్ప తమ కుటుంబంతో కలిసి కారులో రాయచోటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో సూరప్పగారిపల్లెకు సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే అడ్డంగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో నంజుండప్పతోపాటు ప్రకాష్, హేమావతిలకు రక్తగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా బిడ్డను కాపాడండయ్యా.!

- అనారోగ్యంతో అల్లాడుతున్న బిడ్డను ఆదుకోవాలని వేడుకోలు
- మందులకు డబ్బులు లేక తల్లిదండ్రుల ఆవేదన



నవీన్ తేజతో తల్లిదండ్రులు హరిప్రసాద్, స్వర్ణలత

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ నాగిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన నాయనపల్లి హరిప్రసాద్, స్వర్ణలత దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు నవీన్ తేజ (14) పుట్టిన కొన్ని రోజులకే తీవ్ర అస్వస్థతకు గురవడంతో హైదరాబాదులోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెలో రంధ్రం ఉందనడంతో ఆందోళన చెందారు. పది కిలోల బరువు ఉంటేనే శస్త్ర చికిత్స చేసేందుకు వీలవుతుందని చెప్పడంతో వెనక్కు వచ్చారు. తిరిగి ఏడేళ్ల అనంతరం నిమ్స్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా గుండెలో రక్త ప్రసరణ సరిగా లేదని, ఊపిరితిత్తుల్లోకి రక్తం చేరుతుందని, అవయవాలు సైతం దెబ్బతిన్నాయని శస్త్ర చికిత్స చేయలేమని, చేసినా ప్రయోజనం లేదని తేల్చి చెప్పారు. దీంతో అప్పటి నుంచి కేవలం మందులతోనే నెట్టుకొస్తున్నారు. నవీన్ తేజ గత ఏడాది స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న సమయంలో తలనొప్పితో బాధపడుతూ కళ్లు తిరిగి పడిపోవడంతో వెంటనే తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేయగా మెదడులో కణతి ఉందని చికిత్స చేశారు. అయినా నాలుగు అడుగులు నడిచినా ఆయాసంతో పడిపోతున్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులకు వెళితేనే గాని తమకు పూట గడవదని, అలాంటిది తమ కుమారుడి మందులకు నెలకు రూ. 6 వేలు వరకు ఖర్చు అవుతోందని వాపోతున్నారు. ఇప్పటి వరకు సుమారు పది లక్షల రూపాయల వరకు అప్పులు చేసి ఆసుపత్రుల చుట్టూ తిరిగామని, ప్రస్తుతం ఆర్థిక స్తోమత లేకపోవడంతో మందులుసైతం కొనలేని దుస్థితిలో ఉన్నామని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇటీవల తమ కుమార్తె ఆరోగ్యం కూడా బాగోలేదని ఆసుపత్రుల వెంట తిరుగుతూ కూలి పనులకు వెళ్లలేక వేదనతో బతుకీడుస్తున్నామని చెబుతున్నారు. దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించి తమ కుమారుడిని కాపాడాలని, ప్రభుత్వం పింఛను అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

గిరిజన మహిళపై దాడి హేయమైన చర్య



జిల్లా ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

మదనపల్లె : గిరిజన మహిళ అలివేలమ్మ పై జరిగిన దాడి హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. అగ్రవర్ణాల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని సీపీఎం నాయకులు హరింద్రనాథ్ శర్మ, నాగరాజు, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకుడు కోనేటి దివాకర్, బాస్ నేత ముత్యాల మోహన్ లు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ అలివేలమ్మ ఒకే కుటుంబం శీలంవారిపల్లిలో ఉంటోందన్నారు. ఆమెను అక్కడి నుంచి పంపించేయాలని దురుద్దేశంతో అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు అకారణంగా గొడవ పెట్టుకుని ఆమెను వివస్త్రను చేసి విచక్షణారహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. దాడిని అడ్డుకోబోయిన కోడలు బాలింత అని కూడా చూడకుండా దాడి చేయడం దుర్మార్గమన్నారు. బాధిత మహిళకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు నిందితులను కాపాడేందుకు ప్రయత్నించడం ఏంటని ప్రశ్నించారు. గుర్రంకొండ ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేసి డీఎస్పీ స్థాయి అధికారిని విచారణకు ఆదేశించాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ ప్రజలపై చిన్నచూపు తగదని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆయన కూడా పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలిపారు.

రోడ్డుపై నిర్మించిన గోడ తొలగింపు



నక్కలదిన్నెలో రోడ్డుకు అడ్డుగా నిర్మించిన గోడను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నెలో రోడ్డుకు అడ్డంగా కొందరు వ్యక్తులు నిర్మించిన గోడను మంగళవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. నక్కలదిన్నె తండాలో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు వీధిలో ఇతరులు రాకపోకలు సాగించకుండా అడ్డుగా గోడను నిర్మించారు. దీనిపై ఇంకో వర్గానికి చెందిన వ్యక్తులు మున్సిపల్ కార్యాలయం, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో టీపీఓ జకీరాబేగం పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది పోలీస్ బందోబస్తు మధ్య గోడను తొలగించారు. తొలగింపు సందర్భంగా ఎలాంటి గొడవలు, ఘర్షణలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

రైల్వే మంత్రి దృష్టికి రైళ్ల హాల్టింగ్ సమస్య

ఎంపీ మిథున్‌రెడ్డి



రైల్వే మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి

రాజంపేట : రాజంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, నందలూరు తదితర రైల్వే స్టేషన్లలో రైళ్ల హాల్టింగ్స్ విషయాన్ని మంగళవారం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో దేశ రాజధానికి వెళ్లే ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, తిరుపతి– కొల్హాపూర్ మధ్య నడిచే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ సౌకర్యం త్వరగా కల్పించాలని కోరామన్నారు. అలాగే రైల్వేకోడూరులో హరిప్రియ, ఎంజీఆర్ చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలన్నారు. జిల్లాలో రైల్వే పరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వే కేంద్రానికి పూర్వ వైభవం కల్పించాలన్నారు. తిరుపతి–హుబ్లీ ప్యాసింజర్ రైలును బ్రిటీష్ కాలం నాటి రెడ్డిపల్లె రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ పేర్కొన్నారు.